ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి 5 ములుగు

గురువారం 8 ఫిబ్రవరి 2024





సమ్మక్కగుడిలో గద్దెను అలంకరిస్తున్న పూజారుల కుటుంబసభ్యులు

మేడారం ట్రస్టు బోర్డు లేనట్టేనా?



- ఇప్పటివరకు ప్రకటన ఇవ్వని దేవాదాయశాఖ
- తాత్కాలిక పునరుద్ధరణ కమిటీలకే అధికారుల మొగ్గు
- 2014, 2016, 2020, 2022 నాటి పరిస్థితులే పునరావృతం
- ట్రస్ట్ బోర్డు లేకుంటే రూ.105కోట్ల పనులపై పర్యవేక్షణ లేనట్టే..

వరంగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం మహాజాతర పనులను పర్యవేక్షించే ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయశాఖ దృష్టి సారించటం లేదు. ఇప్పటికే ప్రభుత్వం మేడారం జాతరలో భక్తులు సౌకర్యాలు కల్పించేందుకు రెండు విడతల్లో రూ.105కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జాతరలో చేపట్టే పనులను, ఆదివాసీ గిరిజన సంప్రదాయంలో జాతర జరిగేలా పర్యవేక్షించే ట్రస్టు బోర్డు ఏర్పాటు నియామకంలోనూ తాత్సారం చేస్తోంది. 14మంది సభ్యులతో ఏర్పాటు చేసే కమిటీ కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారుల్లో కదిలిక లేకపోవటంతో 2014, 2016, 2020,2022 నాటి జాతర ఘటనలే పునారావృతం అవుతాయా అనే చర్చ సాగుతోంది. అయితే స్వయంగా మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగులోనే మేడారం జాతరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో జాప్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మహాజాతరకు ట్రస్ట్ బోర్డు

మేడారం మహా జాతరకు ఆరు నెలల ముందే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయటం ఆనవాయితీ. మహాజాతర అభివృద్ధి, ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, జాతర సమయంలో బెల్లం, కొబ్బరికాయలు, భక్తుల క్యూలైన్లు తదితర వాటిని పరిశీలించి.. జాతర సాఫీగా సాగేందుకు ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేస్తారు. గతంలో 9మందితో ఉండే ఈ ట్రస్ట్ బోర్డులో సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2018 మహాజాతరలో ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడితోపాటు 14మంది సభ్యులు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా నియమించారు. దీంతో కమిటీ సభ్యుల సంఖ్య 15కు చేరింది. ఆ తరువాత 2020, 2022 జాతరలకు ట్రస్ట్ బోర్డుకు బదులుగా పునరుద్ధరణ కమిటీని నియమించారు. ఈ కమిటీలో కూడా 15మందికి చోటు కల్పించారు. అధికార పార్టీ నేతల ప్రతిపాదనలకే దేవాదాయశాఖ ఆమోదం తెలపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ట్రస్ట్ బోర్డు కోసం దేవాదాయశాఖ జాతరకు ఆరు నెలల ముందే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఈ నోటిఫికేషన్ వెలువడిన తరువాత 20రోజుల్లో ట్రస్ట్ బోర్డు ప్రకటించాలి. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్‌బోర్డు ఏర్పాటులో కదిలిక లేదు. మహాజాతర సమీపిస్తుండటంతో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుపై అధికారులు చొరవ చూపకపోవటం విమర్శలకు దారితీస్తోంది.

ట్రస్ట్ బోర్డు లేకుండానే..

పదేళ్లకాలంలో ఐదు జాతరలు రాగా, వీటిలో నాలుగు జాతరలకు ట్రస్ట్ బోర్డు కమిటీ లేకుండానే నిర్వహించారు. గతంలో అధికారపార్టీ నేతల్లో కమిటీపై ఆధిపత్యం కోసం కొట్లాడి.. కమిటీనే లేకుండానే జాతర నిర్వహించి విమర్శలు ఎదుర్కొన్నారు.



2014లో మహా జాతరకు ట్రస్ట్ బోర్డు కమిటీ ఎంపికలో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీలో విభేదాల ఏర్పడ్డాయి. దీంతో కమిటీ నియామకం జరగలేదు. దీంతో గద్దెల వద్ద సమ్మక్క-సారలమ్మల ప్రసాదం (బెల్లం) పంపిణీలో, తలనీలాల సేకరణ, క్యూలైన్‌ల ఏర్పాటు, కొబ్బరికాయల అమ్మకం, గద్దెల వద్ద బెల్లం తొలగింపు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2016లో అయితే బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న విభేదాల వల్ల ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయలేదు. మూడు నెలల ముందు జాతర పునరుద్ధరణ పేరుతో ఓ కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో జాతర పనులపై పర్యవేక్షణ, భక్తుల సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తలెత్తాయి. అయితే 2018లోమాత్రం కాక లింగయ్య చైర్మన్‌గా ట్రస్ట్ బోర్డును మూడు నెలల ముందే నియమించారు. ఆ తరువాత మళ్లీ అదే కథ పునారావృతం అయింది. 2020, 2022 మహాజాతరలకు రాజకీయాల అడ్డు రావటంతో పునరుద్దరణ కమిటీలతో జాతరను మమ అనిపించారు. ప్రస్తుత మహాజాతరకు కూడా పునరుద్ధరణ కమిటీతో మమ అనిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

కమిటీ ఏర్పాటయ్యేనా..?

ఈసారి కూడా ట్రస్ట్ బోర్డు నియమించే పరిస్థితులు కనిపించటం లేదనే టాక్ వినిపిస్తోంది. మహాజాతరకు మరో 14రోజుల సమయమే ఉంది. ఈ నేపథ్యంలో కమిటీ నియామకం ఎప్పుడు జరుగుతుందనే చర్చ సాగుతోంది. ఇప్పటివరకు దేవాదాయశాఖ నుంచి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసి... ఆసక్తి ఉన్న సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం 20 రోజుల్లో కమిటి ప్రకటించాల్సి ఉంది. కానీ, మహాజాతరకు 14 రోజుల సమయమే ఉండటం.. దేవాదాయశాఖ నుంచి కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడకపోవటం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈసారి కూడా 2014, 2016, 2020, 2022 తరహాలోనే మేడారం మహాజాతరకు కమిటీ లేకుండానే అభివృద్ధి కమిటీనో..

మిగతా 7వ పేజీలో..

ఏటా.. అదే తీరు..

- మేడారం భక్తులకు తప్పని పాట్లు
- ప్రతీ జాతరలోనూ అవే సమస్యలు
- మౌలిక వసతులపై చిన్నచూపు

7

మహా జాతరకు తొలిపూజ

- గుడిమెలిగే పండుగతో గిరిజన కుంభమేళాకు అంకురార్పణ
- మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 7: తెలంగాణ గిరిజన కుంభమేళ.. మేడారం మహాజాతరకు అంకురార్పణ జరిగింది. గుండెమెలిగే పండుగతో వడ్డెలు (పూజారులు) తొలిపూజ చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల జాతరకు ప్రారంభ సూచికగా జరిగే ఈ వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. సనాతన ఆచారం ప్రకారంగా తొలి పూజగా భావించే ఈ కార్యక్రమంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజా మందిరాలను శుద్ధి చేసి.. పైకప్పును గుట్టగడ్డితో కప్పారు. దీనినే గుడిమెలిగే పండుగా పేర్కొంటారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ గుడులు, ఏటూరునాగారం మండలం కొండాయిలో గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్లలో పగిడిద్దరాజుల గుడుల్లో ఈ కార్యక్రమాలు ఘనం గా జరిగాయి. తలపతుల ఆధ్వర్యంలో వడ్డెలు సంప్రదాయ పూజ లు చేసి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. దీనికి ముందు వేకువ జామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేశారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కఠోర ఉపవాసాన్ని పాటించిన వడ్డెలు కాళ్లకు చెప్పులు లేకుండానే గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ గుడుల వద్దకు చేర్చా రు. గుడులపై పాత కప్పును తొలగించి కొత్త గడ్డితో కప్పారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజా మందిరాల్లో ఉన్న తల్లి గద్దెను అలికి ముగ్గులతో అలంకరించారు. మహాజాతరకు తొలిపూజగా ఈ కార్యక్రమాలు జరగ్గా ఈనెల 14న (బుధవారం) మండమెలిగే పండగ జరగనుంది. ఆ రోజు మేడారానికి నలువైపులా ద్వారబంధనాలు, రక్షా తోరణాలు కట్టి మహాజాతర నిర్విఘ్నంగా జరగాలని, వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని వడ్డెలు వేడుకుంటారు. ఇక జాతరకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలొచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టల వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతలకు ఎత్తు బంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీర, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించారు. బుధవారం సుమారు 2లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మేడారం పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



రామప్ప హుండీ ఆదాయం రూ.7.33 లక్షలు



దేవాలయం ఆవరణలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 7: మండలంలోని ప్రఖ్యాత రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయ హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. దేవాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా దేవాదాయ శాఖ పరిశీలకుడు అనిల్ కుమార్ పర్యవేక్షించారు. హుండీల్లోని కానుకలను లెక్కించగా మొత్తం రూ. 7,33,433 ఆదాయం సమకూరిందని ఆయన వెల్లడించారు. ఇందులో రూ.7లక్షల 970 నోట్లు, రూ.32,433 నాణేలు ఉన్నట్లు వివరించా రు. ఈ కార్యక్రమంలో దేవా లయ కార్యనిర్వహణాధికారి బిల్ల శ్రీనివాస్, తహసీల్దార్ శివకుమార్, ఏఎస్సై కిష్టయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

కాకతీయఖని, ఫిబ్రవరి 7: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. పట్టణంలోని సుభాష్‌కాలనీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా డీజీఎం (పర్సనల్) తుకారం హాజరయ్యారు. మూడు రోజులుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫైనరింగ్, క్యాంపు, క్రాఫ్ట్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్యాం ప్రసాద్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం





గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ సిబ్బంది, స్వాగత్ మృతదేహం

మేడారం, ఫిబ్రవరి 7: తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగులో గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని దీపక్‌నగర్‌కు చెందిన పోలవేణి స్వాగత్ (23) వనదేవతలను దర్శించుకోవడానికి కుటుంబంతో కలిసి మేడారం రాగా జంపన్నవాగులో మంగళవారం సాయంత్రం గల్లంతైన విషయం విదితమే. రంగంలోకి దిగిన పోలీసులు గత ఈతగాళ్ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం రెస్క్యూటీం ద్వారా గాలించగా స్వాగత్ మృతదేహం లభ్యమైందని డీఎస్పీ రవీందర్ తెలిపారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో ఈతకు వెళ్లి పాలమడుగు వద్ద లోతు ప్రదేశంలో స్వాగత్ గల్లంతయ్యాడని చెప్పారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ రవీందర్, సీఐ శంకర్ సందర్శించారు. స్వాగత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులు వాణి, లక్ష్మణ్‌కు అప్పగించారు. స్వాగత్ అవివాహితుడు కాగా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా స్వాగత్ మొదటి సంతానం.

బాల్క సుమన్‌పై కాంగ్రెస్ కన్నెర్ర



మంగపేటలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంగపేట, ఫిబ్రవరి 7: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై సుమన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి తూడి భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ముఖ్యమంత్రిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండనీయమన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే నైతికత ఆయనకు లేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో అమాయకపు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన సుమన్ రేవంత్‌ను దూషించటం సిగ్గు చేటన్నారు. ఇదేక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి వ్యాఖ్యలపై కూడా కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న ప్రజా ప్రభుత్వం కూలుతుందని చెప్పడం, ఇక్క ప్రజల మనోభావాన్ని దెబ్బతీయడమే అవుతుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పెద్ది నర్సింహరావు, మహబూబ్‌ఖాన్, కాటబోయిన నర్సింహరావు, కోడేల నరేష్, హిదాయతుల్లా, చాద మల్లయ్య, మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం : బాల్క సుమన్, విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా వారి దిష్టబొమ్మలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా నాయకుడు బాదం ప్రవీణ్, బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు వావిలాల చిన్న ఎల్లయ్య, లాలయ్య, ఎమ్డీ. ఖలీల్ ఖాన్, ఎమ్డీ. అయ్యుబ్ ఖాన్, నర్సింగరావ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



ఇంజనీర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి హరిప్రసాద్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు కలెక్టరేట్ ఆవరణలోని గోదాంలో ఎఫ్ఎల్‌సీ, వెబ్‌కాస్టింగ్, ఈవీఎంలను భద్రపరచడం, వెబ్‌కాస్టింగ్ గదులను బుధవారం ఎన్నికల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి హరిప్రసాద్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎఫ్ఎల్‌సీ, ఎన్నికల ఏర్పాట్లు, ఎఫ్ఎల్‌సీ నిర్వహణ, ఈవీఎంల గోదాంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీప్యాట్ యంత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




కుందనపల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల, ఫిబ్రవరి 7: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని 19 గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. రూ. 2 కోట్ల 35 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని కుందనపల్లిలో ప్రారంభించారు. చీపురుపట్టుకొని రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 వరకు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులు చెత్తా చెదారాన్ని తొలగించాలని, డ్రెయినేజీలను శుభ్రపర్చాలని అన్నారు. ప్రజలు వ్యక్తగతంగానే కాకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, వైనాల రవీందర్, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీజీ సెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలో టీజీ సెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. టీజీ సెట్ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈనెల 11న రాష్ట్ర మైనారిటీ గురుకులాలు మినహా మిగిలిన అన్ని గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం టీజీ సెట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,294 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకు ఏడు సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష రాసిన అనతరం సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్న పత్రాలను సీల్ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో కోఆర్డినేటర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

ఏటూరునాగారం, ఫిబ్రవరి 7 : మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. మనం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. వైజంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఆకులవారిఘణపురం మీదుగా క్రాస్ రోడ్డులోని ఐటీడీఏ కార్యాలయం వరకు సాగింది. మహాజాతరలో ప్లాస్టిక్‌ను వాడొద్దని విద్యార్థులు ప్లకార్డ్స్, బ్యానర్స్‌ను ప్రదర్శించారు. మనం వెల్ఫేర్ వ్యవస్థాపకులు చౌలం శ్రీనివాస్‌రావు, ప్రచార కార్యదర్శి పెద్దల నరేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న, లెక్చరర్లు రవీందర్, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ అధికారులు, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజారాం, రమణ, ఉపాధ్యాయులు తౌసీఫ్, సంపత్, రమేష్, రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

సుబేదారి, ఫిబ్రవరి 7: గుండెపోటుతో వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులోనే వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి హనుమకొండ బస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన గడ్డం దామోదర్(50) గీత కార్మికుడు. దామోదర్ ఏటూరునాగారంలో బంధువులకు సంబంధించిన ఓ ఫంక్షన్ ఉంటే బుధవారం ఉదయం వెళ్లాడు. తిరిగి ఏటూరునాగారం నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు రావడానికి రాత్రి 7గంటల సమయంలో బస్సు ఎక్కాడు. రాత్రి 10గంటల సమయంలో బస్సు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులందరూ బస్సు దిగి వెళ్లిపోగా దామోదర్ బస్సులోనే కూర్చుని ఉండడంతో బస్సు కండక్టర్ వెళ్లి పరిశీలించగా దామోదర్ ఎటూ కదలలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆర్టీసీ అధికారులు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంబులెన్స్‌లో ఉన్న డాక్టర్ దామోదర్‌ను పరిశీలించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న దామోదర్ భార్య మహాలక్ష్మీ, కుమారుడు, కూతురు అల్లుడు వచ్చి బోరున విలపిస్తూ దామోదర్ మృతదేహాన్ని తీసుకెళ్లారు.



బస్సులో మృతి చెందిన దామోదర్

290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను బుధవారం రాత్రి హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన లారీని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బస్తాలు ఉన్నాయి. వెంటనే లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీ వెంట ఉన్న చినిగిరి సమ్మయ్య, మౌటం వీరయ్య, మౌటం మధుకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న లారి, టూ వీలర్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు దేవేందర్, రమేశ్, ఎస్సైలు రియాజ్, అశోక్, కానిస్టేబుల్ ప్రకాశ్ సిబ్బంది ఉన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు - ఇద్దరి మృతి

శంకరపట్నం, ఫిబ్రవరి 7: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీం నగర్ నుంచి హనుమకొండవైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58) అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



మేడారంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణంలో మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు

రెండు లక్షలకుపైగా తరలొచ్చిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన వనదేవతల సన్నిధి



ఎత్తు బంగారం సమర్పిస్తున్న చిన్నారి



జంపన్నకు దండం పెడుతున్న భక్తురాలు

మేడారం, ఫిబ్రవరి 7 : మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతర ఈనెల 21నుంచి నాలుగు రోజుల పాటు జరగనుండగా ముందస్తుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల వద్ద తలనీలాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని వనదేవతలకు ఎత్తుబంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. సుమారు రెండు లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దీంతో మేడారం పరిసరాలు కిటకిటలాడాయి.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఏటా అదే తీరు..

● మేడారంలో భక్తులకు తప్పని పాట్లు ● ప్రతీ జాతరకు అవే సమస్యలు..
● నిర్వహణ పరంగానే ఏర్పాట్లు ● మౌలిక వసతులపై అధికారుల చిన్నచూపు

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో భక్తులకు పాట్లు తప్పడం లేదు. ప్రతీసారి కోట్లాది రూపాయల వ్యయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా.. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు జాతర నిర్వహణపై పెడుతున్న దృష్టి.. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం పెట్టడం లేదు. దీనితో ఎంత భారీగా ఏర్పాట్లు చేసినా.. జాతర జరిగే ఆ నాలుగు రోజులు భక్తులు జాతర ప్రాంగణంలో ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా దర్శనం సందర్భంగా తల్లుల గద్దెల వద్ద విపరీతమైన రద్దీలో భక్తులు పడే యాతన నరకాన్ని తలపిస్తుంది. ఒక పక్క పోలీసుల ఆంక్షలు, మరో పక్క క్యూలైన్లో విపరీతమైన ఒత్తిళ్ల మధ్య గద్దెల వద్దకు చేరుకొని అమ్మవార్లను దర్శనం చేసుకోవడం ఎంతో ప్రయాసతో కూడుకొని ఉంటుంది. ఈ పరిస్థితి చక్కదిద్దడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సెంటిమెంట్‌తో ఆటలు

మేడారంలో అధికారులు భక్తుల సెంటిమెంట్‌తో ఆటలు ఆడుకోవడం పరిపాటిగా మారింది. గద్దెల వద్ద భక్తుల రద్దీని తగ్గించే పేరుతో ప్రతీ జాతరకు కొత్త ప్రతిపాదనలు తెరమీదికి తీసుకువస్తున్నారు. ఇవి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉంటున్నాయి. వారి నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో చివరి నిమిషంలో విరమించుకుంటున్నారు. ఈ సారి కూడా అధికారులు ఓ కొత్త ఆలోచన చేశారు. భక్తుల బంగారాన్ని (బెల్లం) కన్వేయన్ బెల్టుద్వారా గద్దెల మీదికి చేర్చడం. కొన్ని రోజుల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారం ఏర్పాట్లపై జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులు ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి జాతరకు వచ్చిన భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకునే క్రమంలో తమ వెంట తెచ్చుకున్న బంగారాన్ని గద్దెలపై స్వయంగా సమర్పించాలనుకుంటారు. అలా చేయడంలోనే వారు ఎంతో సంతృప్తి చెందుతారు. సాధారణ సమయాల్లో గెద్దల వద్దకు వచ్చి చీరె, సారె పసుపు, కుంకుమ, గాజులతో పాటు బెల్లం (బంగారం) స్వయంగా సమర్పిస్తారు. జాతర సమయంలో అది సాధ్యం కాదు కనుక.. గెద్దలపైకి బెల్లం ముద్దలను విసిరేస్తారు. ఇలా భక్తులు విసిరిన బెల్లంతో వనదేవతల గద్దెలు పూర్తిగా నిండిపోయి నిండుగా కనిపిస్తాయి. ఈ సందర్భంగా బెల్లం ముద్దలు తగిలి భక్తులు గాయపడడం కూడా జరుగుతుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులు గద్దెల వద్ద నేరుగా బంగారం సమర్పించే వీలు లేకుండా బయటి నుంచి గద్దెల వరకు ఒక కన్వేయర్ బెల్టును ఏర్పాటుచేసి దానిపై బంగారాన్ని ఉంచితే అది గెద్దల వద్దకే చేరేలా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చేశారు. దీనివల్ల జాతరలో గెద్దలపైనే భక్తులు నేరుగా బంగారాన్ని సమర్పించుకునే భాగ్యాన్ని కోల్పోతారు. ఇది ఒక రకంగా భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయడమే. పూజారులు సహజంగానే దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి పిచ్చి ఏర్పాట్లు చేయడానికి వీలులేదని తెగేసి చెప్పారు. దీనితో ఈ ప్రతిపాదను వాయిదా వేశారు.

కౌంటర్లు ఏమయ్యాయి?

వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్న తర్వాత భక్తులకు బంగారం దొరకడమే గగనమవుతుంది. గద్దెలపై ఉన్న బంగారాన్ని తీసుకోవడానికి వీలు లేకుండా చుట్టూ బారికేడ్లు ఉంటాయి. అయినా వాటిని చేధించుకొని వెళ్లి చేతికి అందినంత తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడం, కొంత మంది భక్తులు గాయపడడం తరుచూ జరుగుతూ ఉంటుంది. గద్దెల వద్ద ఉన్న వలంటీర్లను భక్తులు ఎంత బతిమిలాడినా బంగారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తారు. భక్తులు గద్దెలపై విసిరిన వెండి, బంగారం, నగదును ఏరుకోవడానికి పోటీ పడే వలంటీర్లు వారికి కాసింత బంగారాన్ని ఇవ్వడానికి మాత్రం నిరాకరిస్తారు. దీనితో చాలా మంది భక్తులు అమ్మవార్ల గద్దెల మీది బంగారం దొరక్క నిరాశగా వెనుదిరుగుతారు. తల్లులకు సమర్పించిన బంగారాన్ని పంచిపెట్టే వ్యవస్థ జాతరలో ఇప్పటి వరకు లేదు. ఈ అంశం ప్రతీ సారి అధికారుల సమీక్షా సమావేశంలో చర్చకు వచ్చినా పట్టించుకోవడం లేదు. అయితే గతంలో భక్తులకు బంగారం పంచిపెట్టడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇది ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి జాతరలో ఎన్నో పనులు చేసే అధికారులు బంగారం పంపిణీకి ఏర్పాట్లు ఎందుకు చేయరన్న భక్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేసినట్లయితే గద్దెల వద్ద బంగారం కోసం భక్తులు ఎగబడే పరిస్థితి తొలగిపోతుంది. రద్దీకూడా తగ్గుతుంది.



క్యూలైన్లలో నరకం

తల్లుల దర్శనానికి క్యూలైన్లలో నిలబడే భక్తులు ప్రతీ సారి నరకాన్ని చవిచూడాల్సి వస్తోంది. చాంతాడంతటి క్యూలో గంటల తరబడి వేచిచూసే భక్తులకు అక్కడ తాగడానికి కనీసం మంచినీరు కూడా దొరకదు. అనేక మెలికలు తిరిగి ఉండే ఈ క్యూలో ఒక్కసారి చిక్కుకుంటే మధ్యలో వెనక్కి తిరిగి రావడం ఏ మాత్రం కుదరదు. గద్దెల వద్దకు చేరుకునే వరకు వేచి ఉండాల్సిందే. మధ్యలో బయటకు వచ్చేందుకు దారిలేక భక్తులు అనేక అవస్థలు పడుతుంటారు. తాగడానికి మంచినీరు దొరక్క దప్పికతో గొంతు ఎండిపోయి విలవిలలాడుతూ ఉంటారు. తాగునీటిని అందించేందు క్యూలైన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సి ఉన్నా అధికారులు దానిని పట్టించుకోరు. క్యూ మధ్యలో ఉన్నవారికి బయటి నుంచి తాగునీటిని అందించడం కష్టమే. ఈ దృష్ట్యా క్యూలైన్ల మధ్య పలు చోట్ల తాగునీటి నల్లాలను, లేదా నీటి డ్రమ్ములను గానీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాథమిక చికిత్స

క్యూలైన్లలో నిల్చున్నవారు అస్వస్థతకు గురైతే తక్షణం వైద్య సదుపాయం అందించే ఏర్పాట్లు కూడా చేయడం లేదు. జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆస్పత్రిని, అక్కడక్కడ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినా క్యూలైన్ల మధ్య ఇలాంటి సౌకర్యం కల్పించడం లేదు. క్యూలైన్లలో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. గాలి సరిగా ఆడదు. పైగా ఉక్కపోత. గంటల తరబడి వేచి ఉండడం వల్ల శారీరక అలసట. దీనితో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు అస్వస్థతకు గురికావడం తరుచూ జరుగుతుంటుంది. వారిని పద్మవ్యూహం లాంటి క్యూలైన్ నుంచి బయటకు తీసుకురావడం అంటే.. కురుక్షేత్రంలో యుద్ధం చేసినట్టే. కష్టపడి బయటకు తీసుకువచ్చేలోగా వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. అందువల్ల క్యూ మధ్యలోనే అక్కడక్కడ ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మార్గమధ్యలో దాహం.. దాహం

మేడారం జాతరకు అటవీ గ్రామాల మీదుగా వచ్చే భక్తులు మార్గమధ్యలో తాగునీటి ఇబ్బందులను తప్పడం లేదు. కమలాపూర్ క్రాస్‌రోడ్డు మీదుగా రాంపూర్, చికినెపల్లి, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, బయ్యక్కపేట, మీదుగా నార్లాపూర్ నుంచి మేడారం చేరుకునే భక్తులు తాగునీటి సదుపాయం లేక మార్గ మధ్యలో దాహంతో అల్లాడిపోతుంటారు. పది నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం వరకు మార్గ మధ్యలో ఎక్కడా ఆగునీటి వసతిలేక ఇబ్బందులు పడుతుంటారు. ఈ మార్గంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిపోతుంటారు. చేతిపంపులను ఏర్పాటు చేసినా మరమ్మతులు లేక అవి సరిగా పని చేయవు. జాతర సమీస్తున్నందు వల్ల ఈ రహదారిలో తాగునీటి వసతి కల్పించడంతోపాటు తిరుగు ప్రయాణంలో భక్తులు సేద తీరేందుకు వీలుగా తాత్కాలికంగా షెడ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎత్తుబంగారానికి ఆధార్ తప్పనిసరి

మేడారం జాతరలో ఎత్తు బంగారం సమర్పించుకునే భక్తులకు కొత్తగా ఆధార్ తిప్పలు వచ్చి పడ్డాయి. మేడారం సమక్క-సారలమ్మ జాతరలో ఎక్కువగా భక్తులు చెల్లించే మొక్కు ఎత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించుకోవడం. ఇప్పుడు ఈ మొక్కు చెల్లింపునకు ఎక్సైజ్ అధికారులు ఆధార్ లంకె పెట్టారు. ఎత్తు బంగారం కొనేవారు ఆధార్‌కార్డును తప్పని సరి చూపించాల్సిందే. లేదంటే ఎత్తుబంగారం కొనుగోనడానికి వీలు కాదు. బెల్లం అమ్మే దుకాణాల్లో ఎత్తుబంగారం కొనుగోలు చేసే భక్తులు ఆధార్‌కార్డును విధిగా చూపించాలి. ఆ కార్డులోని వివరాలను రాసుకున్న తర్వాతే వ్యాపారులు వారికి ఎత్తు బంగారం తూకం వేస్తారు. గుడుంబా తయారీని అడ్డుకునేందుకే ఈ నిబంధన పెట్టామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

మహాలక్ష్మీ పథకం పుణ్యమా అని ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు లభించినందువల్ల ఈ సారి మేడారానికి వచ్చే మహిళల సంఖ్య పెరగవచ్చునని భావిస్తున్నారు. ఒక వేళ అదే జరిగితే ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రతీసారి జాతరకు ఆర్టీసీ మూడు వేల బస్సులను నడుపుతుంది. బస్సుల ద్వారా సుమారు 20 లక్షల మందికిపైగా భక్తులు జాతరకు వస్తుంటారు. ఈ సారి వీరి సంఖ్య 30 లక్షలకు చేరవచ్చునని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనితో బస్సుల సంఖ్యను మరింత పెంచే విషయమై ఆలోచిస్తోంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉన్నందువల్ల గతంలో జాతరకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపని మహిళలు సైతం ఈ ఉచిత వెసులుబాటు విని యోగించుకొని జాతర బాట పట్టవచ్చునని భావిస్తున్నారు. ఈ దృష్ట్యా రద్దీ పెరిగే అవకాశం ఉన్నందువల్ల మహిళల కోసం ప్రత్యేకంగా మరికొన్ని బస్సులను వేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.





మేడారం బస్‌స్టేషన్ నుంచి బస్సు దిగి వస్తున్న ప్రయాణికులు

సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దాం..

జాతర నిర్వహణకు పటిష్ఠ పోలీసు బందోబస్తు : ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

దామెర, ఫిబ్రవరి 7: ఆసియా ఖండంలోనే అతి పెద్ద మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పోలీసు శాఖ, మీడియా సమన్వయంతో విజయవంతం చేద్దామని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరై, మేడారం జాతర నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు. మహాజాతర సజావుగా సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశంపై ఇష్టాగోష్టి నిర్వహించారు. ఇందులో భాగంగా గత జాతరలో ఏవైనా ఇబ్బందులు, తలెత్తిన సమస్యలపై ఆయా దినపత్రికలు, మీడియా ఛానళ్ల ప్రతినిధులతో కాసేపు చర్చించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడారం మహా జాతరలో మీడియా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎక్కడా కూడా ఇబ్బందులు కలుగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రతీ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ పార్కింగ్ సెక్టార్, ప్రతీ సెక్టార్ ఓ డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారని వివరించారు. ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు, హెల్ప్ డెస్కులు, డ్రోన్లను వినియోగిస్తూ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గత జాతరలో 1200 ఎకరాల పార్కింగ్ స్థలానికి అదనంగా మరో 500ల ఎకరాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తు చర్యల్లో భాగంగా 14వేల మంది పోలీసులకు తోడు మరో 500 మంది సీసీఎస్ పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వివరించారు. అలాగే జాతరకు వచ్చే వారు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. పోలీసు శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వన దేవతలను దర్శించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాగా, మేడారం జాతరలో విధి నిర్వహణలో మీడియా ప్రతినిధులు పలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని ఎస్పీ శబరీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ.. మీడియా ప్రతినిధులకు ప్రత్యేక పాసులు కేటాయించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్వో లక్ష్మణ్ రావు, మేడారం జాతర లైజనింగ్ ఆఫీసర్ (దుగ్గొండి సీఐ) పి.కిషన్, స్పెషల్ బ్రాంచి సీఐ కిరణ్‌కుమార్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరను నిర్వహిస్తున్న నేపథ్యంలో మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ఈనెల 15 వరకు కొనసాగనుంది. ములుగు జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని కలెక్టర్ మేడారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని అన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కృషి చేయాలన్నారు. మేడారంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలాగే మహాజాతరలో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవో స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

దొంగలున్నారు.. జర భద్రం



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరకు ముందే మేడారంలో రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో భక్తులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. 'దొంగలున్నారు జాగ్రత్త' అంటూ భక్తులను అలర్ట్ చేస్తున్నారు. గత జాతరల్లో దొంగతనాలకు పాల్పడిన పోలీసులకు చిక్కిన వారి ఫొటోలతో ఫ్లెక్సీలను రూపొందించి మేడారంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అలాగే దేవాదాయ శాఖ అధికారులు సైతం దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మైకుల ద్వారా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

మేడారం ట్రస్ట్ బోర్డు లేనట్టేనా?

(5వ పేజీ తరువాయి)

పునరుద్ధరణ కమిటీనో నియమించి చేతులు దులుపుకుంటారనే చర్చ సాగుతోంది.

ట్రబులే..

మేడారం మహాజాతర ట్రస్ట్‌బోర్డుకు ఉన్న అధికారాలు పునరుద్ధరణ కమిటీకి ఉండవు. ట్రస్ట్ బోర్డు జాతరకు వచ్చే అభివృద్ధి నిధులపై సమీక్షించే అధికారం ఉంది. పనుల నాణ్యతను పరిశీలించటమే కాకుండా.. కొత్త పనులు చేపట్టేలా సమీక్ష సమావేశంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తుంది. అధికారులు నిర్వహించే ప్రతీ రివ్యూలోనూ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపైన ప్రశ్నించటం, సలహాలు, సూచనలు ఇస్తుంది. కానీ, పునరుద్ధరణ కమిటీకి ఇవేం లేవు. కేవలం జాతరను ఎలా సక్సెస్ చేయాలో మాత్రం చూస్తుంది. అభివృద్ధి పనులకు ఈ పునరుద్ధరణ కమిటీకి సంబంధం ఉండదని సమాచారం. అధికారులపై ఒత్తిడి తెచ్చి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరే పరిస్థితి కూడా లేదని సమాచారం. ఓ రకంగా ఈ పునరుద్ధరణ కమిటీని ఉత్సవ కమిటీగా భావిస్తారని తెలిసింది. దీంతో మహాజాతరలో పాలకమండలి పర్యవేక్షణ లేకపోతే అభివృద్ధి నాణ్యతకు తూట్లు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మేడారం మహాజాతరలో రూ.105కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షణపై పునరుద్ధరణ కమిటీకి ఎలాంటి అధికారం లేకపోవటంతో నాణ్యతలోపంతో పాటు ఇతర సమస్యలపై ప్రశ్నించేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారా నిలువెత్తు బంగారం

మేడారం జాతరలో భక్తులకు వెసులుబాటు

బెల్లం డబ్బులు చెల్లిస్తే తల్లులకు సమర్పణ

పోస్టల్ ద్వారా భక్తులకు ప్రసాదం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో వనదేవతలకు ఆన్‌లైన్ ద్వారా బంగారం (బెల్లం) సమర్పించే వీలును ప్రభుత్వం కల్పించింది. పోస్టుద్వారా ప్రసాదాన్ని స్వీకరించే అవకాశాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు లక్షలాదిమంది భక్తులు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒరిస్సా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులు తమ ఎత్తు బంగారం (బెల్లం)తల్లులకు సమర్పించాలని మొక్కుకోవడం ఆనవాయితీ. ఎత్తుబెల్లంతో వనదేవతలకు సందర్శించుకొని మొక్కు చెల్లించుకోవడం వీలుకాని భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ వెసులుబాటు కల్పించింది. వీరి కోసం ఐటీశాఖ సహాయంతో టీ మీసేవా మొబైల్ యాప్ (టీఏపీపీ)ను రూపొందించింది. ఈయాప్ ద్వారా బెల్లాన్ని బుక్‌చేసి దేవతలకు సమర్పించవచ్చు. ఎత్తు బెల్లం ఇవ్వాలనుకునే ఒక వ్యక్తి 50 కిలోల బరువు ఉన్నాడనుకుంటే కిలోకు రూ.60 చొప్పున మొత్తం రూ.3000ను అలాగే మీసేవా చార్జీ కింద రూ.35, పోస్టల్ చార్జీల కింద రూ.100 కలిపి మొత్తం రూ.3,135 చెల్లిస్తే పోస్టల్ కొరియర్ ద్వారా బంగారం భక్తులకు అందుతుంది. మీ సేవా సెంటర్‌కు వెళ్లి మీసేవా-సిటిజన్ వెబ్‌సైట్‌ను తెరిచి లేదా మీ సేవా వెబ్‌సైట్‌లో http://tsmeesevatelangana.gov.inలో లాగిన్ అయి కూడా ఈ సేవలను పొందవచ్చు. లేదా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీఏపీపీ పోలియోను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ సేవలను పొందవచ్చు.

నాణ్యత లేని చలువ పందిళ్లు



గద్దెల వద్ద వెదురు బొంగులతో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

మేడారం, ఫిబ్రవరి 7: మేడారంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో నాణ్యత లోపించిందని తెలుస్తోంది. నాసిరకమైన వెదురు బొంగులతో ఏర్పాటు చేయడంతో ఇవి ప్రమాదకరంగా మారాయని భక్తులు భయాందోళన చెందుతున్నారు. సుబాబుల్, జామాయిల్ కర్రలను ఉపయోగించకుండా అటవీ ప్రాంతంలో ఉచితంగా లభ్యమైన వెదురు బొంగును కాంట్రాక్టర్ వాడటం సరికాదని, ఇవి విరిగిపోయే ప్రమాదం ఉందని భక్తులు అంటున్నారు.

ఘనంగా గుడిమెలిగే పండుగ

● చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఘట్టం ప్రారంభం

గూడూరు, ఫిబ్రవరి 7 : చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం గుడి మెలిగే పండుగను ఘనంగా నిర్వహించారు. మహా జాతరకు రెండు వారాల ముందు గుడి మెలిగే పండుగను నిర్వహించడం అనవాయితీ. పూజారుల సంఘం అధ్యక్షుడు దారం సిద్దు ఆధ్వర్యంలో పూజారులు అత్యంత నియమనిష్టలతో డోలు వాయిద్యాల నడుమ వేడుకను నిర్వహించారు. పూజారులు వారి ఇళ్లను శుద్ధి చేసుకుని అటవీప్రాంతానికి గుట్ట (అడవి) గడ్డిని సేకరించి గుడిపై కప్పారు. అనంతరం గుడిలోని వన దేవతల గద్దెల ముందు ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. గుడి మెలిగే పండుగతో వనదేవతల మహాజాతర ప్రారంభమైనట్లు పూజారులు భావిస్తారు. ఇప్పటి నుంచి పూజారులు అత్యంత నియమనిష్టలు పాటిస్తారు. మళ్లీ వారం 14న బుధవారం చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో మండమెలిగే పండుగను ఘనంగా చేపట్టనున్నారు. దీంతో జాతర ఘట్టం పూర్తిగా ప్రారంభమవుతుంది. చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు ఊపందుకోనున్నాయి. మళ్లీ వచ్చే మూడో బుధవారం 21న జాతర ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షుడు పెనక నాగయ్య, ప్రధాన కార్యదర్శి సహదేవులు, పూజారుల కమిటీ ప్రధాన కార్యదర్శి కారం లక్ష్మయ్య, జాతర కమిటీ ఉపాధ్యక్షుడు వాసం భద్రయ్య, కోశాధికారి సనుప వీరస్వామి, పూజారులు, జాతర కమిటీ సభ్యులు తాటి సుధాకర్, పూనెం జనార్దన్, దారం నరేష్, సిద్దబోయిన పోతయ్య, కొట్టెం వజ్జయ్య, దారం సాంబరాజు, పూనెం అశోక్, ఈసం భద్రమ్మ, బిజ్జ బుచ్చమ్మ, దారం రాము, వాసం రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వనదేవతల ఆవాసమైన గుడిసెపై గడ్డి కప్పుతున్న పూజారి, జాతర కమిటీ నిర్వాహకులు

'బీసీల గురించి మాట్లాడే హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదు'


మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 : బీసీల గూర్చి మాట్లాడే నైతికహక్కు ఎమ్మెల్సీ కవితకు లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే విగ్రహం ఎదుట బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నడు లేనిది ఈ మధ్య ఎమ్మెల్సీ కవిత బీసీల జపం పాడుతున్నారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల ఓట్లు దండుకోవడానికి కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహనీయులు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని మాట్లాడని కవిత ఇప్పుడు రాష్ట్ర అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముందు బీఆర్ఎస్ కార్యాలయాల్లో పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రగతిభవన్‌కు మహనీయులు జ్యోతిబాపూలే పేరు పెట్టిన విషయాన్ని ఎమ్మెల్సీ కవిత మర్చిపోయారా! అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కమ్మగాని కృష్ణమూర్తి, గుంజె హన్మంతు, కాంగ్రెస్ ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ పింద్రాల రాందాసు, సారగ్, అవెత్‌కుమార్, మల్లేష్, విక్రమ్, మల్లయ్య, హరీష్, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మెపా మండల కమిటీ ఎన్నిక


రమేష్ అధ్యక్షుడు సురేష్ కార్యదర్శి

కేసముద్రం, ఫిబ్రవరి7 : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) కేసముద్రం మండల కమిటీని నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ బుధవారం ప్రకటించారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా కేసముద్రం విలేజికి చెందిన నారబోయిన రమేష్, ధన్నసరికి ప్రధాన కార్యదర్శిగా కొండ సురేష్‌ను నియమిం చినట్లు చెప్పారు.

ఆర్‌బీఎస్‌కే జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక


తెలంగాణ ఆర్‌బీఎస్‌కే ఉద్యోగుల కొత్త కార్యవర్గం

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 7 : వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న తెలంగాణ ఆర్‌బీఎస్‌కే ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ప్రియాంక, సంజీవనాయక్, అక్షిత, ప్రధాన కార్యదర్శిగా శివరాం, సహాయ కార్యదర్శిగా సౌజన్య, శ్రీజ, లావణ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అశోక్, రఘునాథ్, సుమలత, కోశాధికారిగా సాయిలక్ష్మి, సౌమ్యకుమారి, కార్యవర్గ సభ్యులుగా రేణుక, శ్రీలక్ష్మి, భవాని, సుందర్‌లాల్‌లను ఎన్నుకున్నారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థుల ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి7 : జిల్లాలో వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్య సమస్యలను గుర్తించి, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) అంబరీష అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్, కళాశాల, అంగన్‌వాడీ సెంటర్లలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారిఆరోగ్య పరిస్థితులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వైద్యులు విజయ్‌కుమార్, కుమార్, యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, కెవి.రాజు, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్‌లో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఎస్కే. బాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 12న జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీని చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్క, ఆలకుంట్ల సాయిలు, ఊడుగుల లింగన్న, చిర్ర యాకయ్య, లింగంపల్లి లింగయ్య, హేలావత్ హేలా, తోకల వెంకన్న, చింత వెంకన్న, బట్టు వెంకన్న పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసిన త్యాగమూర్తి రమాబాయి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : దేశ బహుజనుల భవిష్యత్తుకు బాటలు వేసి త్యాగమూర్తి రమాబాయి అని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. మహబూబాబాద్ పత్తిపాక గిరిజన బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలలో సంఘం జిల్లా అధ్యక్షుడు వీరస్వామి అధ్యక్షతన బుధవారం రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోతు కిషన్‌నాయక్, నాయకులు కడారి శ్రీనివాస్, బేతమల్ల నీలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానుకోట ఫారెస్టు కార్యాలయం

ఎదుట రైతుల ఆందోళన

● ఇద్దరిపై కేసు నమోదు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి7 : ఫారెస్టు భూమిని చదును చేశారనే అభియోగంతో తమపై తప్పుడు కేసులు బనాయించారని గిరిజన రైతులు మహబూబాబాద్ ఫారెస్టు కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అమనగల్ శివారు బలరాంతండాకు చెందిన ఇస్లావత్ కిషన్, ఇస్లావత్ రమేష్ అనే రైతులు తండా శివారులోని తమ వ్యవసాయ భూమిని డోజర్‌తో దున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు భూమి వద్దకు చేరుకుని అటవిభూమిని చదును చేశారని, తమపై తప్పుడు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేసును వెనక్కి తీసుకోవాలని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ జోత్స్నాదేవిని వివరణ కోరగా అటవీ భూమిని డోజర్‌తో చదును చేశారని, వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అటవీ అధికారులపై దుర్భాషలాడుతూ.. విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. కాగా, మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు రైతులపై కేసు నమోదు చేశారు.

'జిల్లాలో చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించాలి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 : చెరువులు, కుంటలను భూకబ్జాదారుల నుంచి రక్షించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి నాగమణికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు పెద్దఎత్తున కబ్జాలకు గురవుతున్నాయని ఐనప్పటికి ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారని చెప్పారు. చెరువులు, కుంటలను కబ్జాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, సొసైటీల్లో ప్రతీ మత్స్యకారుడికి సభ్యత్వం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారబోయిన వెంకటేశ్వర్లు, సింగాని అశోక్, మల్లయ్య, ఆంజనేయులు, వీరయ్య నాగరాజు, రాంభద్రం, పిల్లి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను మహబూబాబాద్ జిల్లాలోని ఐదు మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు, కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందడానికి ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ http://tmreis.telangana.gov.inలోదరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్నీ వివరాలకు సెల్ నెంబర్ : 98859 83942, 73966 91373 లేదా అందుబాటులో ఉన్న మైనార్టీ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు.

'సభను విజయవంతం చేయండి'


కరపత్రాలను విడుదల చేస్తున్న రవి

గంగారం, ఫిబ్రవరి 7 : ఖమ్మంలో మార్చి 3న జరిగే మూడు విప్లవ సంస్థల ఐక్యత జాతీయ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపు నిచ్చారు. ఈ మేరకు బుధవారం గంగారంలో కరపత్రాలు విడుదల చేసిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు విప్లవ సంస్థలు ఏకమై పోరాటాలు తీవ్రతరం చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పూనెం ప్రభాకర్, ఈరెల్లి మల్లేష్, రాజు, ఆలవాల సురేష్ పాల్గొన్నారు.

'గ్రామస్థుల సహకారం మరువలేనిది'


జంగవానిగూడెంలో సర్పంచ్‌ను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి సక్రు

కొత్తగూడ, ఫిబ్రవరి 7 : తన ఐదేళ్ల కాలంలో గ్రామస్తుల సహకారం మరువలేనిదని, గ్రామాభివృద్ధికి కృషి చేశానని సర్పంచ్ ఈసం స్వామి పేర్కొన్నారు. జంగవాని గూడెంలో బుధవారం సర్పంచ్ ఈసం స్వామి, ఉపసర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌కు ప్రత్యేకాధికారి సక్రు, గ్రామస్తులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంద్రజ, గ్రామ పటేల్ భూపాల్, గ్రామస్తులు ఇర్ప సారంగపాణి, మచ్చ సూరయ్య, పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని సక్సెస్ చేయాలి

● తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్

కొత్తగూడ, ఫిబ్రవరి 7 : మేడారంలో ఈనెల 13న నిర్వహిస్తున్న ఆదివాసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఆదివాసీ సమ్మేళనం కరపత్రాలను తుడుందెబ్బ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్, కార్యవర్గ సభ్యులు ఈసం వెంకన్న, ఈక సురేందర్, ఈసం సుధీర్, పొడుగు రామారావు, ఇర్ప రవి, బచ్చల బాలయ్య, తాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

నెల్లికుదురు, ఫిబ్రవరి 7 : మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో ప్లాస్టిక్‌నిషేధం, పర్యావరణ పరిరక్షణపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కె.రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణం కలుషితమవుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండ్లలో చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ జెల్ల వెంకటేష్, జీపీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న లెనిన్ వత్సల్ టోప్పో

బయ్యారం, ఫిబ్రవరి 7 : జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో కొత్తపేట గ్రామపంచాయతీలో బుధవారం పర్యటించి, ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ పంచాయతీ సిబ్బంది, కార్మికులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి 15 వరకు చేపట్టే స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టి, పచ్చదనంగా తీర్చిదిద్దాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, ఒకవేళ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. తదనంతరం గ్రామంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి నవాక్ ఆలీ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

డోర్నకల్, ఫిబ్రవరి 7 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం నుంచి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీవో మున్వర్‌బేగ్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్లను శుభ్రం చేయడం, రెండుకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించడం, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చడం, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేయడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లాంటి కార్యక్రమాలను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


నితిన్‌కుమార్ (ఫైల్)

గార్ల, ఫిబ్రవరి7 : విద్యుదాఘాతంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన బంగ్లతండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై జినిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. బంగ్లాతండాకు చెందిన జాటోతు మోతీలాల్ కుమారుడు నితిన్‌కుమార్ (20) ఖమ్మం కవిత మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండురోజులు సెలవు కావడంతో స్వగ్రామమైన బంగ్లాతండాకు వచ్చాడు. బుధవారం ఉదయం స్నానం చేసేందుకు నీటిని తీసుకువెళ్లి హీటర్ పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మోతీలాల్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై రవీందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


బీఆర్ఎస్ కౌన్సిలర్ల సమావేశం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని భారతరాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో మానుకోట మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు సన్నద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. స్థానిక మునిసిపాలిటీలో 22 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా ఈ సమావేశానికి 16 మంది కౌన్సిలర్లు హాజరైనట్లు సమాచారం. ఇందులో వార్డు కౌన్సిలర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. సాయంత్రం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సమక్షంలో సమావేశమవుదామని సాయంత్రానికి వాయిదా వేసినట్లు విశ్వసనీయ సమాచారం. సాయంత్రం వేళలో కౌన్సిలర్లు హాజరు కాపోవడంతో సమావేశం జరగలేదని తెలిసింది.

గ్రంథాలయ సమస్యలపై ప్రత్యేకాధికారికి వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గంథాలయ అధికారి అభిషేక్

కేసముద్రం, ఫిబ్రవరి 7 : కేసముద్ర స్టేషన్‌లోని గ్రంథాలయం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ టి.దామోదర్‌కు బుధశారం వినతి పత్రం అందజేశారు. గ్రంథాలయ అధికారి చారి అభిషేక్ మాట్లాడుతూ 1978లో వివేకానంద గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారని, గ్రంథాలయ శాఖ పరిధిలోకి తీసుకువస్తే అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరిందని చెప్పారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి అశోక్, సహాయకుడు బాబా ఉన్నారు.



కార్మిక, రైతు వ్యతిరేక చర్యలను ఎండగడదాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

డోర్నకల్, ఫిబ్రవరి 7 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మేధావివర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్‌కుమార్, ఉప్పనపల్లి శ్రీనివాస్, కొడవళ్ల సైదులు, దాసరి మల్లేశం పాల్గొన్నారు.

అయ్యగారిపల్లిలో చోరీ

కురవి, ఫిబ్రవరి 7 : అయ్యగారిపల్లిలోని ఉస్తెం సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు కురవి ఎస్సై బైరు గోపి తెలిపారు. సత్యనారాయణ తండ్రి చనిపోవడంతో ఇంటికి కీడు వచ్చిందని సత్యనారాయణ కుటుంబం ఊరుబయట గుడిసె వేసుకుని నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేరని గ్రహించిన దొంగలు తలుపులు పగులగొట్టి, ఇంట్లో ఉన్న తులం బంగారం, రూ.8 వేల నగదును అపహరించుకుపోయారని తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

గార్ల, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో కాంగ్రెస్ మండల కార్యనిర్వహణ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి సుమన్ దిష్టిబొమ్మను పట్టణంలో ఊరేగించి చెప్పులతో కొడుతూ నెహ్రూసెంటర్‌లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండ రాముగౌడ్, దీకొండ రాము, బానోత్ మల్లిబాబు, వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సక్సెస్ చేయండి

కురవి, ఫిబ్రవరి 7 : సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోతు కిషన్‌నాయక్ పిలుపును ఇచ్చారు. కురవిలో బుధవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం.. నవ సమాజ నిర్మాణం కోసం సేవాలాల్ వేసిన బాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. సేవాలాల్ జయంతిని ప్రతీ గిరిజన కుటుంబం జరుపుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 20 వరకు జరిగే సేవాలాల్ జయంతిలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవానాయక్, కిషన్‌నాయక్, చందునాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

'వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలి'

గార్ల, ఫిబ్రవరి 7 : రానున్న వేసవి కాలంను దృష్టిలో పెట్టుకునీతంపేటలో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఎంపీటీసీ జి. నాగమణి అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బుధవారం పారిశుధ్య నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది సైదులు, వెంకటరెడ్డి, ప్రభాకర్, గండు బిక్షపతి, మాలోతు బిక్షం పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నఎమ్మెల్యే మురళీనాయక్

'సేవాలాల్ జయంతిని అధికారికంగా ప్రకటించాలి'

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 7 : గిరిజన ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడే వేం నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డితో కలిసి సీఎంని బుధవారం మర్యాదపూర్వకంగా కలుసు కుని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ నాణెంపై సేవాలాల్ మహరాజ్ బొమ్మను ముద్రించాలని కోరారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో అరగంట సమయం కేటాయించి చర్చిద్దామని తెలిపారని వివరించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్‌చందర్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యోగ నియామకాలపై అవగాహన ఉండాలి

● సీనియర్ నాన్ కమిషనర్ అధికారి రాజేష్



మాట్లాడుతున్న రాజేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : యువత అగ్నివీర్ వాయు ఉద్యోగ నియామకాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నివీర్ వాయుసేన సీనియర్ నాన్ కమిషన్ అధికారి రాజేష్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నిర్వహించే అగ్నివీర్ వాయు ఉద్యోగనియామకాల ఎంపికపై అవగాహన కల్పించారు. అనంతరం అగ్నివీర్‌వాయు ఉద్యోగులు రాజేష్, దేవ్‌కాంత్ మిశ్రాలను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామారత్నమాల, రామ్‌రెడ్డి, మమత, బొంద్యాలు, వేణుగోపాల్, శశికాంత్, మల్లేశం, రాజేందర్, సుజిత్‌రెడ్డి, నరహరి, హతిరామ్, ఖాసీంపీరు, సుమలత, సంతోష్‌కుమార్, ఉపేందర్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 7 : ఇటీవల ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందిన వారు పరీక్ష ఫీజును చెల్లించాలని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి 27 వరకు అపరాధ రుసుం రూ.25తో చెల్లించాలన్నారు. మార్చి 4వ తేదీ వరకు రూ.50 చొప్పున ఒక్కొక్క సబ్‌జెక్టుకు అపరాధ రుసుం రూ.50 చెల్లించి, ఫీజులను చెల్లించే వెసలుబాటును తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రకటించిందన్నారు.

నర్సరీని సందర్శించిన ప్రత్యేక అధికారులు

దంతాలపల్లి, ఫిబ్రవరి 7 : మండలంలోని రేపోణి, గున్నేపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాల్లోని నర్సరీలను బుధవారం డిప్యూటీ సీఈవో నర్మద ఆధ్వర్యంలోని బృందం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ నర్సరీలో ఉన్న మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలన్నారు. గతంలో నాటిన మొక్కలను సంరక్షణ చేయాలన్నారు. మొక్కల అవశ్యకతను గుర్తించి గ్రామ సభల ద్వారా మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో అప్పరపాషా తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

పెద్దవంగర, ఫిబ్రవరి 7 : ప్రజలందరి సహకారం, భాగస్వాయంతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ వి.మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టగా, ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 7 : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని తొర్రూరు తహసీల్దార్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం ఫత్తేపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వినోద్ కుమార్ మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల హెచ్ఎం వెంకన్న, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'మునిసిపల్ సిబ్బందికి వేతనాలు పెంచాలి'

మరిపెడ, ఫిబ్రవరి 7 : మునిసిపల్ సిబ్బందికి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ నాయకుడు కేలోత్ శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడ మునిసిపల్ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 16వ తేదీ నుంచి తాము సమ్మె చేస్తున్నందున ముందస్తుగా మునిసిపల్ కమిషనర్ రాజుకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేలోత్ శ్రీనివాస్ విలేఖరులతో మాట్లాడారు. మునిసిపల్ సిబ్బంది కొన్నేళ్లుగా నిత్యం వెట్టిచాకిరి చేస్తున్నా తమ బతుకులు మారడంలేదని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తమ ఇబ్బందులను గుర్తించి మునిసిపల్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను సత్వరం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, అశోక్‌రెడ్డి, వీరన్న, గణేశ్, లింగమ్మ, పద్మ, దివ్య పాల్గొన్నారు.